క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ రికండక్టరింగ్ పనుల నేపథ్యంలో గురువారం కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ నూజివీడు ఫీడర్ పరిధిలో ఎంఎన్‌కే విటాస్ విల్లాస్, దూలపల్లి రోడ్డు, నాగార్జున హోమ్స్, నూజివీడు సీడ్స్ కంపెనీ, అశ్విన్‌కాలనీ, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ అపార్ట్‌మెంట్స్, శాంతినికేతన్ విల్లాస్, అప్పలరాజు మహేంద్ర షోరూమ్, అపర్ణ సెకండ్ గేట్ వీ3 విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కరోనా లక్షణాలు ఉంటే కోవిడ్ పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 15 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలియజేశారు. ఎవరికైనా రోజుల తరబడి జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పుల వంటి లక్షణాలుంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

మొక్కలను సంరక్షించేందుకు ఇలా..



ప్రగతినగర్‌లోని కెప్టెన్ లక్ష్మీసెహగల్ పార్కులో మామిడి మొక్కకు ఏర్పాటు చేసిన బోర్డు

నిజాంపేట్: మొక్కలు నాటడమే కాదు.. వాటిని పరిరక్షించేందుకు ప్రజలు తమ వంతు కృషి చేస్తున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని కెప్టెన్ లక్ష్మీసెహగల్ పార్కులో వివిధ రకాల మొక్కలు నాటారు. మామిడి, జామ వంటి మొక్కలతో పాటు పూలమొక్కలు, పచ్చదనాన్ని పెంపొందించే వివిధ జాతుల మొక్కలను పెంచుతున్నారు. ఆహ్లాదాన్ని పెంచే మొక్కల ఆకులు, పూలను పార్కుకు వచ్చే పలువురు తెంపుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని స్థానికులు పార్కులోని మామిడి మొక్కలకు బోర్డులను ఏర్పాటు చేశారు. దయచేసి 'మామిడి ఆకులను కోయొద్దు.. మొక్కలను పెరగనిద్దాం..'అంటూ బోర్డుపై రాయడంతో ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసేదిగా ఉంది. పార్కులో మొక్కలను సంరక్షించేందుకు స్థానికులు చేపడుతున్న చర్యలు ఆదర్శప్రాయమని పలువురు ప్రశంసిస్తున్నారు.

ఓయూలో దీక్షకు రావాలని రేవంత్‌కు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటన పై ఓయూలో చేపట్టనున్న మహా నిరసన దీక్షకు రావాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని విద్యార్థి నేతలు ఆహ్వానించారు. బుధవారం గాంధీభవన్‌లో రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రం ఇవ్వగా మొదటి రోజు (24న) హాజరవుతానని రేవంత్ హామీ ఇచ్చినట్లు విద్యార్థి నేతలు పేర్కొన్నారు.

ఆర్ట్స్ కాలేజీ ఎదుట దీక్షలకు అనుమతి లేదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభలు, సమావేశాలు, దీక్షలకు ఎలాంటి అనుమతి లేదని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. పాలక మండలి నిర్ణయం మేరకు రెండు సంవత్సరాలుగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. ఈ నెల 24, 25న నిర్వహించనున్న మహానిరసన దీక్ష తమ దృష్టికి రాలేదని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

గాయత్రికి 'ఉత్తమ గళ మహిళ' పురస్కారం

సనత్‌నగర్: ప్రముఖ డబ్బింగ్ కళాకారిణి, తన గళంతో రైల్వే సమాచారం అందించే వ్యాఖ్యాత గాయత్రి 'ఉత్తమ గళ మహిళ' పురస్కారం అందుకున్నారు. ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో బేగంపేట కుందన్‌బాగ్‌లో నిర్వహించిన ఉగాది, మహిళా దినోత్సవ వేడుకల్లో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. సమాజ హితాన్ని కాంక్షించే వారిని గుర్తించి సత్కరించడం ఎంతో అవసరమని, ఇది ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. గాయత్రి గత మూడు దశాబ్దాలుగా డబ్బింగ్ కళాకారిణిగా ఎన్నో సినిమాలు, సీరియల్స్‌తో పాటు రైల్వేకు తన మధుర గాత్రాన్ని అందించడం ఎంతో అభినందనీయమన్నారు. మహిళా దినోత్సవాలు జరుపుకుంటున్న ఈ సమయంలో ప్రతిభావంతురాలైన మహిళను సత్కరించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. సినీ, టీవీ నటుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. గాయత్రి లాంటి ప్రతిభ గల ఆర్టిస్టులను గుర్తించి సత్కరిస్తే వారు ఆ రంగంలో మరింతగా రాణించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర రావు, ఆకృతి సుధాకర్ పాల్గొన్నారు.

ఉగాది... నవ వసంతానికి నాంది

శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు



జైజగన్నాథ పూజా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో కూన శ్రీశైలంగౌడ్

శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా కనులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉగాది పచ్చడిని ప్రసాదంగా అందజేశారు. అదే విధంగా సంక్షేమ సంఘాలు, వివిధ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కొత్త సంవత్సరంలో ఆయా రాశుల గ్రహ ఫలితాలు, శుభ ఫలితాలను తెలుసుకున్నారు.

– కుత్బుల్లాపూర్



బచ్‌పన్ స్కూల్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి, చిన్నారులు



వెన్నెలగడ్డ మూడుగుళ్లలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



నిజాంపేట్‌లో బీఆర్ఎస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు



ఆలయంలో కొలువైన చిత్తరమ్మ దేవి



వెన్నెలగడ్డ మూడుగుళ్లలో అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రగతినగర్‌లోని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ కార్యాలయంలో పంచాంగ శ్రవణం

సమన్వయ లోపం.. రోడ్డుపైనేస్తంభం

రంగారెడ్డినగర్: అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా అభివృద్ధి పనులు చేపట్టినా సత్ఫలితాలు ఇవ్వడం లేదు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఐడీపీఎల్ – జగద్గిరిగుట్ట రోడ్డును రెండు సంవత్సరాల క్రితం రూ.3కోట్ల నిధులు వెచ్చించి సుమారు 2 కిలోమీటర్ల మేర విస్తరించారు. రోడ్డుకు ఇరువైపులా 40 ఫీట్ల వరకు రోడ్డును వెడల్పు చేసి వాహనాల రాకపోకలకు అనువుగా అభివృద్ధి పరిచారు. అయితే జగద్గిరిగుట్ట నుంచి ఐడీపీఎల్‌కు వచ్చే దారిలో ఎర్రగోడలు దాటిన తరువాత రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను మాత్రం జరపడం లేదు. దీంతో లక్షలు వెచ్చించి చేపట్టిన రోడ్డు విస్తరణ బూడిదలో పోసిన పన్నీరు అన్న చందంగా మారింది.

- 20 ఫీట్ల మేర విస్తరించిన రోడ్డులో కొంత భాగం ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేయగా మిగతా ప్రాంతంలో స్తంభాలు ఉండటంతో ఇదే అదనుగా భావించిన కొందరు భారీ వాహనాలు, డీసీఎంలను పార్కింగ్ చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు రోడ్డు విస్తరణ సమయంలోనే స్తంభాలను పక్కకు జరపాల్సి ఉన్నా... సర్కిల్ అధికారులతో సమన్వయం లోపించడంతో ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు ఈ విషయాన్ని విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న స్తంభాలను జరపాలని వాహనదారులు కోరుతున్నారు.



జగద్గిరిగుట్ట-ఐడీపీఎల్ రోడ్డులో షిఫ్ట్ చేయని విద్యుత్ స్తంభాలు..

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు భద్రత పెంచండి

ఉస్మానియా యూనివర్సిటీ: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు భద్రత పెంచాలని బీఎస్పీ, బీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో జరిగిన ముఖ్యనేతల సమావేశం అనంతరం బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేష్ చౌహన్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రాణహానీ ఉందని ఆయనకు ఏమైనా జరిగితే రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామని హెచ్చరించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై ఎవరు మాట్లాడినా అణచివేస్తున్నారని ఇటీవల ఆమరణదీక్ష చేపడితే భగ్నం చేసి అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిపై బీఆర్ఎస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. చైర్మన్ జనార్దన్‌రెడ్డిని తొలగించే వరకూ ఉద్యమాలు కొనసాగుతాయని, ప్రవీణ్‌కుమార్‌కు వెంటనే సెక్యూరిటీ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మేందర్, దయాకరన్ మౌర్య, అంబేద్కర్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు



మృతి చెందిన శుభం కుచ్‌లాబే

కుత్బుల్లాపూర్: ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శుభం కుచ్‌లాబే (26), సీమ దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. వీరికి కుషాల్ (02), ప్రఫూల్ (4 నెలలు) ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా శుభం జీడిమెట్ల పైపులైన్ రోడ్డులోని ఎస్‌వీసీ కన్‌స్ట్రక్షన్స్‌లో మేస్త్రీగా పని చేస్తున్నాడు.

- ఈ నెల 20 తేదీన మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో భవనం 3వ ఫ్లోర్‌లో పని చేస్తున్న శుభం ప్రమాదవశాత్తు పై నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లోకి పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయాలు కావడంతో సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 21న మృతి చెందాడు. భవన నిర్మాణ యాజమాన్యం ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య సీమ ఆరోపించారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

26 నుంచి మేడ్చల్ జిల్లాలో పర్యటన

వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌రెడ్డి



కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లాలో వైఎస్సార్‌టీపీని బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. ఈనెల 26న నుంచి మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లోని డివిజన్లు, మున్సిపాలిటీల్లో పర్యటిస్తామన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు నివేదిస్తామని తెలిపారు. రాబోయే రోజులలో పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల పర్యటన గురించి నాయకులు, కార్యకర్తలు, ప్రజలను చైతన్య పరిచి అధినేత్రి పర్యటనలను విజయవంతం చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. అందులో భాగాంగ నిర్వహించే ఈ పాదయాత్రల్లో జిల్లాలోని ఆయా అసెంబ్లీల కోఆర్డినేటర్లు, జిల్లా నాయకులు, అనుబంధ కమిటీల అధ్యక్షుడు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొని సహకరించాలని సురేష్‌రెడ్డి కోరారు.

వేడుకగా భోగ్ బండార్

దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డులో శంకర్ బావాలాల్ మహారాజ్ ఆధ్వర్యంలో మహా చండీయాగం, భోగ్ బండార్ నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో వేడుకలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

– దుండిగల్



తరలివస్తున్న బంజారాలు



పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ శంకర్ నాయక్

అధునాతన హంగులతో బాచుపల్లి ఠాణా

- 24న ప్రారంభోత్సవానికి సిద్ధమైన నూతన భవనం
- నిర్మాణానికి రూ.3.5కోట్లను వెచ్చించిన అరబిందో ఫార్మా ఫౌండేషన్
- కార్పొరేట్ కార్యాలయాలను తలదన్నేలా నిర్మాణం



బాచుపల్లి పోలీస్‌స్టేషన్ నూతన భవనం..

నిజాంపేట్: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సువిశాలమైన ప్రాంతంలో నిర్మించిన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ కొత్త భవనం ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఈనెల 24న తెలంగాణ హోంమంత్రి మహమూద్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై నూతన భవంతిలో పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. అరబిందో ఫార్మా లిమిటెడ్ ధాతృత్వ, కామన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) విభాగమైన అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.3.5 కోట్ల నిధులు వెచ్చించి బాచుపల్లిలోని సర్వే నం.2లోని 1.30 ఎకరాల స్థలంలో సువిశాలమైన భవనాన్ని అన్ని వసతులతో నిర్మించి పూర్తి చేశారు.

రెండంతస్తుల్లో 37 గదులు

- మొత్తం 21 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు అంతస్తుల్లో నిర్మించిన భవనంలో మొత్తం 37 గదులు ఉన్నాయి. ఇందులో 10 మంది ఎస్ఐలకు క్యాబిన్లు, రెండు జైలు గదులు, ఒక సెక్యూరిటీ గార్డు గది, స్టేషన్‌హౌజ్ ఆఫీసర్‌కు ప్రత్యేక గదులు, పోలీస్ సిబ్బందితో పాటు ఫిర్యాదులు చేసేందుకు వచ్చే వారికి అన్ని హంగులతో వసతులు కల్పించారు.



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేక ఆకర్షణగా నాలుగు సింహాల స్తంభం

- మొదటి అంతస్తులో మహిళలు, పురుష సిబ్బందికి వసతి, ప్రత్యేక స్టోర్‌రూమ్, 350 మందికి సరిపోయే విధంగా భోజనశాలను, వంటగదిని ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో సేవలను విస్తరించేందుకు వీలుగా రెండు దశాబ్దాలకు సరిపోయే విధంగా భవనాన్ని తీర్చిదిద్దారు.
- ప్రస్తుతం ఆరుగురు ఎస్ఐలు విధులు నిర్వహిస్తుండగా భవిష్యత్‌లో మరో పది మంది విధులు నిర్వహించేందుకు వీలుగా అదనపు క్యాబిన్‌లను ఏర్పాటు చేశారు. అదే విధంగా పురుషులు, మహిళల కోసం 10 చొప్పున మరుగుదొడ్లు నిర్మించారు.
- రెండో ఫ్లోర్‌లో అధికార కార్యకలపాలు నిర్వహించేందుకు వీలుగా మల్టీపర్పస్ కాన్ఫరెన్స్‌హాలు, నేర, కంప్యూటర్ విభాగాలను నెలకొల్పారు. అదే విధంగా అప్టికల్ ఫైబర్ సహాయంతో 1400 సీసీ కెమెరాలను అనుసంధానం చేసి ఒకే చోట నుంచి పర్యవేక్షించనున్నారు. ఈ కెమెరాలను జూబ్లీహిల్స్‌లోని రాష్ట్ర కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయనున్నారు.

వర్షపునీటిని ఒడిసి పట్టేందుకు భారీ ఇంకుడు గుంత ఏర్పాటు

- వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు, లిఫ్టులు, ట్రైసైకిళ్లు, స్టేషన్‌కు వచ్చే వారికి తాగునీటిని అందించేందుకు 4 ఆర్వో ప్లాంట్లు, రెండు సూట్ రూమ్‌లు, స్టేషన్ ముందు ఖాళీ ప్రదేశంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారి కోసం గ్రానైట్ బెంచీలు, పిల్లలు ఆడుకునేందుకు క్రీడా పరికాలు, ఆహ్లాదాన్ని పంచే విధంగా వాటర్ ఫౌంటేన్, వ్యూపాయింట్, బాలీ థీమ్ పార్కింగ్, గణతంత్ర దినోత్స వేడుకలు సందర్భంగా పరేడ్ నిర్వహించేందుకు గ్రౌండ్, వర్షపునీరు వృథాగా పోకుండా భారీ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు.

కార్పొరేట్ ఆఫీస్‌ను తలపిస్తూ..

బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌ను కార్పొరేట్ కార్యాలయాన్ని తలదన్నేలా నిర్మించారు. స్టేషన్ ఆవరణలోకి రాగానే ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారిని రిసీవ్ చేసుకునేందుకు ఫ్రంట్ ఆఫీస్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. అదే విధంగా లోపల కూర్చునేందుకు వీలుగా అధునాత హంగులతో కుర్చీలు ఏర్పాటు చేశారు.

మెరుగైన సేవలు అందిస్తున్నాం..



అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో నిర్మించిన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ కార్పొరేట్ కార్యాలయాన్ని తలపిస్తోంది. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పాటు పోలీస్ సిబ్బందికి సకల సదుపాయాలను కల్పించారు. ప్రస్తుత సిబ్బంది భవిష్యత్‌లో పెరిగే అవకాశమున్న నేపథ్యంలో దానిని దృష్టిలో పెట్టుకుని భవంతిని సువిశాలంగా నిర్మించారు. గతంలో ఇరుగు భవనంలో ఉన్న బాచుపల్లి పోలీస్‌స్టేషన్ ఇప్పుడు అధునాతన భవంతిలోకి మారడం సంతోషంగా ఉంది. కార్పొరేట్ సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం శుభపరిణామం. ఈనెల 24న రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా నూతన భవనాన్ని అందుబాటులోకి తేనున్నాం.

– నర్సింహారెడ్డి, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్

ప్రజల భద్రత, పౌరుల శ్రేయస్సే లక్ష్యంగా..

అరబిందో ఫార్మా ఫౌండేషన్ ద్వారా ప్రజల భద్రతకు, పౌరుల శ్రేయస్సుకు అరబిందో ఫార్మా లిమిటెడ్ కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే సీఎస్ఆర్ నిధులతో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నాం. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ కొత్త భవంతికి కోట్లాది నిధులు వెచ్చించి అధునాతన సదుపాయాలు కల్పించాం. భవిష్యత్‌లో సైతం ఇదే విధంగా ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుంటాం. – కె.నిత్యానందరెడ్డి, అరబిందో ఫార్మా లిమిటెడ్ ఎండీ, వైస్ చైర్మన్